క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ దేవర

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ఆదివారం పెద్దమ్మ దేవర ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత గ్రామంలో నిర్వహించిన దేవర ఉత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఇతర ప్రాంతాల నుంచి దేవరకు వచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దేవర ఉత్సవంలో పాల్గొన్నారు.

చందనోత్సవం



చందన అలంకారంలో యోగ నరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో సుదర్శన యోగ నరసింహ స్వామికి ఆదివారం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సుదర్శన యోగ నరసింహస్వామి మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా చందనంతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించి కాయకర్పూరాలు సమర్పించి పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సిద్దారెడ్డిపల్లెలో పెద్దమ్మ తల్లికి బోనాలు



పెద్దమ్మ తల్లికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు

చాపాడు : మండలంలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా వేసవిలో పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి ఏడాది పొడవునా పాడి పంటలతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. ఈ క్రమంలో గ్రామంలోని రామాలయం వద్ద పెద్దమ్మ తల్లి సన్నిధిలో బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు స్పందన కార్యక్రమం

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు తెలిపారు. అన్నిశాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అలాగే వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేవీపీఎస్ నూతన కమిటీ

పోరుమామిళ్ల : మండల (కేవీపీఎస్) కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి నూతన కమిటీని ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు భైరవప్రసాద్ అధ్యక్షతన మండల అధ్యక్షుడిగా కుసులూరు రవి, ప్రధాన కార్యదర్శిగా రత్నమయ్య, కోశాధికారిగా సుందరయ్య, సహాయ కార్యదర్శులుగా మహేష్, అనీఫ్, ఉపాధ్యక్షుడిగా రామయ్యలను ఎన్నుకున్నారు.

నేడు రాజువారిపేటలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలో నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజువారిపేటలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. రాజువారిపేటలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి అన్ని రకాలైన మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోండి

చాపాడు : రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలలో ఉండే వ్యవసాయ సహాయకుల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతేడాది రైతు భరోసా పథకం వర్తించని రైతుల కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : రాజుపాళెంలోని కోదండ రామాలయం నుంచి సోమవారం ఉదయం 5 గంటలకు తిరుమలకు పాదయాత్ర ప్రారంభం అవుతుందని ఆ గ్రామ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు తమ వెంట రావచ్చునని, వచ్చిన వారందరికి టిఫిన్, భోజనం ఉచితంగా కల్పిస్తామని పేర్కొన్నారు. 30వ తేదీ నాటికి తిరుమలకు చేరుకుంటామని, కలియుగ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం ఎవరికి వారే టికెట్లు బుకింగ్ చేసుకోవాలని వారు చెప్పారు. వివరాలకు సెల్ నంబర్లు 99894 93864, 91820 99517 సంప్రదించాలన్నారు.

తాటిముంజ.. భలే మజా



ఎన్జీవో కాలనీలో తాటిముంజలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కాయల నుంచి వేరుచేసిన తాటిముంజలు

బద్వేలు అర్బన్ : తాటిముంజలు అనగానే నోట్లో నీళ్ళూరుతాయ్.. వీటిని ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ మండే ఎండల్లో చల్లని ముంజలు తింటే ఆ మజానే వేరు. వేసవి తాపానికి ఉపశమనం, ఆరోగ్యానికి ఆరోగ్యం కావడంతో ప్రజలు వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే గతంలో మాదిరిగా తాటిచెట్ల పెంపకాలు తగ్గిపోయిన నేపథ్యంలో ముంజలకు గిరాకీ బాగా పెరిగింది. పట్టణంలోని అర్బన్ స్టేషన్ సమీపంలో, సిద్దవటం రోడ్డులోని ఎన్జీవో కాలనీ సమీపంలో కొందరు వ్యాపారులు ప్రతిరోజూ తాటికాయలను తీసుకు వచ్చి అక్కడే ముంజలను వేరుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వీరు నెల్లూరు జిల్లాలోని మర్రిపాడు, అనంతసాగరం, చిలకలమర్రి, డి.సి.పల్లి ప్రాంతాలతో పాటు బద్వేలుకు సమీపంలోని అట్లూరు మండలంలో గల ముత్తుకూరు, మణ్యంవారిపల్లె, చౌటపల్లె, వేములూరు ప్రాంతాలలో తాటిచెట్లను కొనుగోలు చేసి వాటి కాయలతో వ్యాపారం నిర్వహిస్తున్నారు.

గతంలో డజను తాటిముంజలు రూ.15 నుంచి 20ల ధర పలుకుతుండేవి. ప్రస్తుతం డజను రూ.60 నుంచి రూ.70లకు పైగా విక్రయిస్తున్నారు.

వైభవంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట



సభలో మాట్లాడుతున్న విరజానందస్వామీజీ

పోరుమామిళ్ల : రామాయపల్లె ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ప్రధానోపాధ్యాయులు తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామిజీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సంస్కారం అలవడితే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. తల్లిదండ్రులకు నమస్కరించి పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఎంతమంది ఉన్నారని ప్రశ్నించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విగ్రహ దాత హైకోర్టు అడ్వకేట్ బైరెడ్డి లక్ష్మిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మార్కారెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, సర్పంచ్ సుధాకర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



బ్రహ్మంగారి మఠంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని ఆదివారం ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి దర్శించుకున్నారు. ఆయనను ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈశ్వరీదేవి మఠంలో కూడా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మనోహరాచారి, మాజీ సర్పంచ్ బి.కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాగార్జునరెడ్డి

బద్వేలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలోని ముసల్‌రెడ్డిపల్లెలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు 600కు పైగా హామీలిచ్చి ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. తమ పాలన నచ్చితేనే ఓటు వేయాలని వైఎస్ జగన్ కోరుతున్నారని, కానీ టీడీపీ నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షులు రాజశేఖర్, నాయకులు డాక్టర్ మాబు, బాస్కర్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పొంగళ్లు

బద్వేలు అర్బన్ : అనంతరాజుపురం పంచాయతీ విజయరామాపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన అంకాలమ్మ, పోలేరమ్మ గ్రామదేవతల పొంగళ్లు కార్యక్రమంలో బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ ఉపసర్పంచ్ కుప్పాలరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులు అంకాలమ్మ, పోలేరమ్మలకు పొంగళ్ళు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఆడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవిశ్రీరాములు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామంలో జూదమాడుతున్న ఐదు మందిని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2270 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రొద్దుటూరు ఎకో ఇన్వెస్టర్స్ సమ్మిట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో సోమవారం ఉదయం 7.30 గంటలకు ప్రొద్దుటూరు ఎకో ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కడప డీఎఫ్ఓ సందీప్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. పార్కులో సౌకర్యాలను మెరుగు పరిచేందుకు ప్రజల భాగస్వామ్యం కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రముఖులు, వాకర్స్, పార్కును అభివృద్ధిని కాంక్షించేవారు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని డీఎఫ్ఓ కోరారు.

బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: హెలెన్ కెల్లర్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ దౌలత్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరదలచిన వారు బ్యాచిలర్ డిగ్రీ లేక మాస్టర్ డిగ్రీలో సైన్సు, సోసియల్ స్టడీస్, హ్యూమానటీస్‌లో ఓసీలు 50 శాతం మార్కు లు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు 45 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు.

కళలను ఆదరించాలి



ఎస్.నాగమునికి గానకళారత్న అవార్డును అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : కళలను, కళాకారులను ఆదరించాలని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం వసంతపేటలోని కోదండ రామస్వామి కళ్యాణ మండపంలో చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా నందవరం చౌడేశ్వరిదేవి పురస్కారాలను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచేది కళాకారులేనని, వారిని ఆదరించాలని తెలిపారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటి మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో 8 ఏళ్లుగా కళాభివృద్ధికి కృషి చేస్తున్న కళాకారులను, కవులను ప్రోత్సాహకంగా అవార్డులను ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు సాహిత్య కళారత్న అవార్డు, ప్రముఖ రంగస్థల నటీమణి శారదాభాయి నటకళారత్న అవార్డు, రంగస్థల నటుడు ఎస్.నాగమునికి గానకళారత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ 8 ఏళ్లలో 48 మందికి అవార్డులను అందించామని తెలిపారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సంగిరెడ్డి పుల్లారెడ్డి, రాష్ట్ర తొగటవీరక్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, తొగటవీర క్షత్రియ మహిళా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరింటి రేణుక, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, రాగా నరసింహారావు, భీమునిపల్లి నాగరాజు, విజయ భాస్కర్, కొత్తపల్లె శీను, బాలనరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ నిర్దేశకులుగా ఎదగాలి



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న జిల్లా సమగ్రశిక్ష పీఓ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : విద్యార్థులు కష్టపడి చదివి సమాజ నిర్దేశకులుగా ఎదగాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్యలు తెలిపారు. స్థానిక తెలుగుగంగ కాలనీలోని దీప్తి నవోదయ, సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు కూడా మార్పు చెందాలని సూచించారు. ప్రతి విద్యార్థి తాను నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం సైనిక్ స్కూల్, నవోదయకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి చెన్నయ్య, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రవీణ్, జమాల్, మహేశ్వర్‌రెడ్డి స్కూల్ కరస్పాండెంట్ మహేశ్వర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



పూజలందుకుంటున్న పెద్దమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏర్పాటు చేసి జంతుబలులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో విందుభోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా పెద్దమ్మతల్లికి పూజలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కోవెలకుంట్ల రోడ్డులో వెలసిన పోలిమెర పెద్దమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఏప్రెల్ 8, 9 తేదీల్లో గ్రామ దేవత పెద్దమ్మ తల్లికి ఘనంగా దేవర నిర్వహించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి దేవర మహోత్సవంలో భాగంగా గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. దేవర చేసిన 16 రోజులు అయిన సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం..



కల్యాణ వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వాముల వారి కల్యాణం కమనీయంగా జరిగింది. లక్ష్మిచెన్నకేశవస్వామి వారి 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అశేష భక్త జనసందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్చారణలతో స్వామి వార్ల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులందరికి నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలోని పుర వీధుల గుండా స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామి వారి ఉయ్యాల సేవను వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. చెక్క భజన భక్తులను విశేషంగా అలరించింది.

అనుమతులు లేకుండా లేఅవుట్లు

యథేచ్ఛగా క్రయవిక్రయాలు



ల్యాండ్ కన్వర్షన్‌కు నోచుకోని పి.పి.కుంట లేఅవుట్

గోపవరం : ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి యథేచ్ఛగా క్రయ విక్రయాలు జరుపుతూ అడ్వాన్సుల పేర్లతో రూ.లక్షలు వసూలు చేస్తున్న వైనం మండలంలో చోటు చేసుకుంది. అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. గతంలో పట్టణాలకు పరిమితమైన లేఅవుట్లు ప్రస్తుతం గ్రామ పంచాయతీల పరిధిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం లేఅవుట్ వేయాలంటే వ్యవసాయ భూమిని కమర్షియల్ భూమిగా (కన్వర్షన్) మార్చుకోవాలి. ఆ తర్వాత సదరు భూమిలో చేపట్టిన ప్లాన్ అప్రూవల్, కన్వర్షన్ కాపీ సదరు పంచాయతీ దృష్టికి తీసుకురావాలి. గ్రామపంచాయతీ నుంచి టౌన్‌ప్లానింగ్‌కు అలేవుట్ అప్రూవల్ పంపించి అక్కడ ఆమోదించిన తర్వాత తిరిగి గ్రామ పంచాయతీకి ఉత్తర్వులు వస్తాయి. అనంతరం సదరు స్థలంలో ప్రజాప్రయోజనాలు రోడ్లు, డ్రైనేజీ కోసం 10 శాతం భూమిని గ్రామ పంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలి. ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాత గ్రామ పంచాయతీకి ఫీజు చెల్లించాలి. గ్రామపంచాయతీ ఆమోదం మేరకు లేఅవుట్‌లో ప్లాట్లు వేసి క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. కానీ ఇవేమీ జరగకుండా నిబంధనలను తుంగలో తొక్కి ఏకంగా గ్రామ పంచాయతీని సంప్రదించకుండానే లేఅవుట్‌లో వేసిన ప్లాట్లు క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసేవారు ఇవన్నీ గమనించకుండా కేవలం నిర్వాహకులు చెప్పిన మాటలు విని ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని బేతాయపల్లె పంచాయతీ పి.పి.కుంట, గోపవరం పంచాయతీలోని హైవే రోడ్డు పక్కన లేఅవుట్లు వేశారు. పి.పి.కుంటలో వేసిన లేఅవుట్‌కు సంబంధించి ఇప్పటి వరకు ల్యాండ్ కన్వర్షన్ కూడా కాలేదు. దీంతో పాటు కొందరు ఉపాధ్యాయులు వేసిన లేఅవుట్‌కు కూడా ఎలాంటి అనుమతులు రాలేదు. కానీ క్రయవిక్రయాలు జరిగాయి. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. అయితే అధిక శాతం లేఅవుట్లకు సంబంధించి ల్యాండ్ కన్వర్షన్ జరిగినప్పటికీ అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని సమాచారం. ఇప్పటికైనా అనుమతి లేని లేఅవుట్ల విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అనుమతి లేని లేఅవుట్లపై గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌ను సాక్షి వివరణ కోరగా అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఇప్పటి వరకు ఒక్క లేఅవుట్‌కు కూడా అనుమతులు రాలేదన్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుంది. పి.పి.కుంట, ఉపాధ్యాయులు వేసిన లేఅవుట్లకు ఇప్పటి వరకు ల్యాండ్ కన్వర్షన్ కూడా జరగలేదు. ప్రభుత్వ అనుమతులు, ఇతర సౌకర్యాలు చూసుకుని వినియోగదారులు కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీచర్ల బదిలీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత బదిలీల కోడ్‌తో టీచర్ల బదిలీలను నిర్వహించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రావన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జిల్లాశాఖ కార్యనిర్వాహక వర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, అధికారులు మారినప్పుడల్లా రకరకాల విధి విధానాలతో టీచర్ల బదిలీ మార్గదర్శకాలు విడుదల చేయడం జరుగుతోందన్నారు. వాటిపై టీచర్లు కోర్టు మెట్లు ఎక్కడంతో బదిలీలు నిర్వహించడంలో అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయన్నారు. అందువల్ల ఆపస్ ఎప్పటినుంచో కోరుతున్న విధంగా టీచర్లకు శాశ్వత బదిలీల కోడ్ రూపొందించి వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలన్నారు. ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడారు.

సమస్యలను పరిష్కరించాలి

ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే దిశగా ముందుకు పోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సివి ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడప ఏపీటీఎఫ్ కార్యాలయం వేదికగా జిల్లా సబ్ కమిటి ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీమియం కడుతున్నా మెరుగైన వైద్య చికిత్స, ఉద్యోగ వైద్య పథకం ద్వారా అందడం లేదన్నారు.